

9న పార్వతీపురంలో జాబ్‌మేళా

పార్వతీపురం, మే 5(ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో ఈ నెల 9న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ పాసై, 18 నుంచి 28 ఏళ్ల వయసు లోపు వారు అర్హులని పేర్కొన్నారు. 12 కంపెనీల ప్రతినిధులు రానున్నారని, అభ్యర్థులు ముందుగా ఎన్ఏఐపీయూ ఎన్‌వైఏఎం.ఏపీ.జీవోవీ.ఇన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. అన్ని సర్టిఫికెట్లతో భాస్కర్ డిగ్రీ కళాశాలకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాల కోసం 91772 97528, 94947 77553 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

జంఝావటం తేలేనా?



- కొలిక్కిరాని ఒడిశా వివాదం
- 47 ఏళ్లుగా కొనసాగుతున్న సమస్య
- పూర్తికాని జంఝావతి ప్రాజెక్టు పనులు
- పలుమార్లు ఇరు రాష్ట్రాల సీఎంలు, ఉన్నత స్థాయి కార్యదర్శుల సమావేశాలు
- అయినా ఫలితం శూన్యం
- సాగునీటికి రైతులు కటకట
- ప్రస్తుతం ఏపీ-ఒడిశాలో అనుకూల పరిస్థితులు
- ఇదే సరైన సమయమని భావిస్తున్న జిల్లా రైతులు
- ముఖ్యమంత్రి చంద్రబాబుపైనే ఆశలు

జియ్యమ్మవలస, మే 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కీలకమైన ప్రాజెక్టుల్లో ఒకటి జంఝావతి. ఒడిశా రాష్ట్రంతో నెలకొన్న వివాదం వల్ల ఏళ్లు గడుస్తున్నా.. దీని పనులు పూర్తి కావడం లేదు. దీంతో పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీరు చేరడం లేదు. ఏటా రైతులు వరుణుడిపైనే ఆధారపడి సాగు చేసుకోవాల్సిన దుస్థితి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చర్చలు జరిపినా.. ఎటువంటి ఫలితం లేకపోయింది. తాజాగా ఏపీ- ఒడిశాలో అనుకూల పరిస్థితులు ఉన్నాయి. ఎన్డీయే ప్రభుత్వాలే కొలువుదీరిన నేపథ్యంలో జంఝావతి సమస్య పరిష్కారానికి ఇదే మంచి తరుణమని జిల్లా రైతులు భావిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపైనే కొండంత ఆశలు పెట్టుకున్నారు. కేంద్ర పెద్దలు, ఒడిశా ప్రభుత్వంతో చర్చలు జరిపి ప్రాజెక్టు పూర్తికి కృషి చేస్తారని, 47 ఏళ్ల నుంచి కొనసాగుతున్న వివాదాన్ని పరిష్కరిస్తారని భావిస్తున్నారు.

ఒడిశాలో పది గ్రామాలే అడ్డంకి..

ఒడిశా రాష్ట్రం కొరాపుట్ జిల్లాలోని పది గ్రామాల్లో 1175.10 ఎకరాలు ప్రాజెక్టు పూర్తికి అడ్డంకిగా మారాయి. అయితే ఆయా గ్రామాల్లో సర్వే చేసి ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చేందుకు రెండు రాష్ట్రాలు అంగీకరించాయి. ఆ రాష్ట్ర పరిధిలోని పూర్తి ముంపు గ్రామాలుగా గుర్తించిన బడబంకిడి లో 230.63 ఎకరాలు, అంబవలసలో 223.62, దిగుబంద్రపల్లిలో 212.84, జయకోటలో 170.88 చొప్పున ఎకరాలు ఉన్నాయి. పాక్షిక ముంపు గ్రామాలైన నాగులవలసలో 96.68 ఎకరాలు, ఉపరభద్రపల్లిలో 94.83 , సాంబన్నకిడిలో 53.76 , హటిగెడలో 37.55 , చక్కవలసలో 30, తాడివలసలో 24.31 చొప్పున ఎకరాలు ఉన్నాయి.

ఇదీ పరిస్థితి..

కొమరాడ మండలం రాజ్యలక్ష్మీపురానికి సమీపంలో ఉంది జంఝావతి ప్రాజెక్టు. 1978లో అప్పటి ప్రభుత్వం దీని నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ ప్రాజెక్టు పనులు పూర్తయితే కొమరాడ, పార్వతీపురం, గరుగుబిల్లి, సీతానగరం, మక్కువ మండల పరిధిలోని 75 గ్రామాల్లో 24,640 ఎకరాలకు పుష్కలంగా సా గునీరందనుంది. కానీ ఒడిశా రాష్ట్రంతో ఉన్న వివాదం కొలిక్కి రాకపోవడం వల్ల 47 ఏళ్ల నుంచి ఈ ప్రాజెక్టు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఏటా కేవలం తొమ్మిది వేల ఎకరాలకు మాత్రమే సాగునీరందుతుం ది. దీంతో కొందరు రైతులు వరు ణుడిపై ఆధారపడి సాగు చేస్తున్నారు. మిగిలిన వారు వలస బాట పడుతున్నారు. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా.. దీనిపై స్పందించేవారే కరువయ్యారు. ఒడిశా ప్రభుత్వాన్ని ఒప్పించి ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యేలా చొరవ చూపకపోవడంపై అన్నదాతలు పెదవి విరుస్తున్నారు.


విఫలమైన చర్చలు

- జంఝావతి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి విషయంలో ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ముఖ్య కార్యదర్శుల మధ్య పలు దఫాలు చర్చలు జరిగాయి. కానీ ఏం ప్రయోజనం లేకపోయింది.
- ఒడిశా రాష్ట్రం కొరాపుట్ జిల్లాలో ఉన్న తూర్పు కనుమల నుంచి నీరు ప్రవహిస్తూ కొండలపై నుంచి 60 కిలో మీటర్లు ప్రవహించి జంఝావతిలో కలుస్తుంది. ఈ మేరకు 1975 సెప్టెంబరు 24న, 1978 డిసెంబరు 15న ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశమయ్యారు. ప్రవహిస్తున్న నీరు 8 టీఎంసీలుగా లెక్కించారు. ఇరు రాష్ట్రాలు 4 టీఎంసీల చొప్పున నీటిని వినియోగించుకోవాలని అంగీకరించారు.
- ఆంధ్ర రాష్ట్రానికి వచ్చిన 4 టీఎంసీలతో పార్వతీపురం, కొమరాడ, గరుగుబిల్లి, సీతానగరం, మక్కువ మండలాల పరిధిలో 75 గ్రామాల్లో దాదాపు 24,640 ఎకరాలకు సాగునీరందించేందుకు ప్రణాళికలు రూపొందించారు.
- 1980, జూలై 27న ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో ఇరు రాష్ట్రాల కార్యదర్శులు సమావేశమై పెండింగ్‌లో ఉన్న ముంపు ప్రాంతంలో జాయింట్ సర్వే చేయాలని నిర్ణయించారు.
- 2002, జనవరి 29న కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన బ్యాక్ వాటర్ ఎఫెక్ట్ అండ్ సబ్‌మెర్జెన్స్ ఎప్రూవ్డ్ ఇరు రాష్ట్రాల కార్యదర్శులు అంగీకరించారు. ఆ తరువాత అదే సంవత్సరం డిసెంబరు 23న భువనేశ్వర్‌లో

ముంపు గ్రామాలు ఇవే..

కొమరాడ మండలం కంబవలసలో 184.31 ఎకరాలు, పిల్లి గుడ్డిలో 212.16 ఎకరాలు, బంజుకుప్పలో 551.92 ఎకరాలు, లక్ష్మీపే టలో 121.61 ఎకరాలు కలిపి మొత్తం 1070 ఎకరాలు ముంపునకు గురవుతాయని అప్పటి ఏపీ ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు 1987లో భూసే కరణ పూర్తి చేసి వారికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కూడా ఇచ్చేసింది.

- ఒడిశా రాష్ట్రం కొరాపుట్ జిల్లా పరిధిలో ఉన్న పది ముంపు గిరిజన గ్రామాల్లో సోషియో ఎకనామిక్ సర్వేకు ఆయా గ్రామస్థులు అంగీకరించడం లేదు. వారు అంగీకరించి రిజర్వాయర్ నిర్మాణం పూర్తి కావాలంటే కచ్చితంగా ఒడిశా ప్రభుత్వ సహాయ సహకారాలు కావాల్సిందే. కానీ ఆ రాష్ట్ర ప్రభుత్వం ఏపీకి సహకరించడం లేదు.



జంఝావతి ప్రాజెక్టుకు అడ్డంకిగా మారిన ఒడిశాలోని ఓ గ్రామం

(మిగతా 8వ పేజీలో...)



పాడైన వాహనాలు ఇలా..

వాటిని వదిలించుకోరు.. వీటిని వినియోగించరు!

- మరమ్మతులకు గురై మూలకు చేరిన పారిశుధ్య వాహనాలు
- కొత్తవాటికి డ్రైవర్ల కొరత
- ఇదీ సాలూరులో పరిస్థితి

సాలూరు రూరల్, మే5(ఆంధ్రజ్యోతి): సాలూరు మున్సిపాలిటీలో విచిత్ర పరిస్థితి నెలకొంది. ఉన్న వాహనాలను వినియోగించుకోరు. తుక్కుగా మారిన వాటిని వదిలించుకోరు. మున్సిపాలిటీలో పారిశుధ్య పనులకు గతంలో వినియోగించిన పలు వాహనాలు నిరుపయోగంగా మారాయి. వాటికి సకాలంలో మరమ్మతులు చేయకపోవడంతో అవి మూలకు చేరాయి. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ.. వినియోగానికి ఏ మాత్రం వీలులేని విధంగా తయారయ్యాయి. ఇప్పటికైనా వాటిని తుక్కు కింద అమ్మితే ఎంతో కొంత మున్సిపల్ ఖజానాకు నిధులు జమయ్యే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా సెప్టిక్‌ట్యాంక్ క్లీనింగ్ కోసం కేంద్ర ప్రభుత్వం సాలూరుకు ఓ వాహనం ఇవ్వగా.. డ్రైవర్ లేని కారణంగా 14 నెలలుగా అది మూలన పడి ఉంది. రూ. 40 లక్షలతో ఏడాది కిందట కొనుగోలు చేసిన ఎక్స్‌కవేటర్‌ను అప్పుడప్పుడు తాత్కాలిక డ్రైవర్‌తో దానిని వినియోగిస్తున్నారు. అయితే అది కూడా ప్రస్తుతం వృథాగా పడి ఉంది. శ్యామలాంబ పండగ సమీపిస్తున్న నేపథ్యంలో ఆ రెండు వాహనాలకు చోదకులను నియమించాలని గత నెల కౌన్సిల్ సమావేశంలో సభ్యులు తీర్మానించారు. అయితే ఇప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. ఈ విషయమై శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్.బాలకృష్ణను వివరణ కోరగా.. తుక్కుగా మారిన వాటిని మున్సిపల్ కమిషనర్ దృష్టిలో పెట్టి విక్రయానికి చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. కొత్త వాహనాలకు రెండు, మూడు రోజుల్లో చోదకులు రానున్నట్టు తెలిపారు.



డ్రైవర్లు లేక వినియోగించని వాహనాలు

మంచినీళ్లు కూడా ఇవ్వకపోతే ఎలా?

- రూ.రెండు కోట్లు వచ్చి నెలలు గడుస్తున్నా పట్టించుకోరా?
- అమ్మవారి పండుగను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోండి
- మంత్రి సంధ్యారాణి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, మే5(ఆంధ్రజ్యోతి): 'మున్సిపాల్టీలో ఉన్న ప్రజలకు తాగడానికి మంచినీళ్లు కూడా అధికారులు ఇవ్వకపోతే ఏం పని చేస్తున్నట్టు? మున్సిపాల్టీ అభివృద్ధికి రూ.రెండు కోట్ల నిధులు వచ్చి ఖాతాలో మగ్గుతున్నా అస్సలు పట్టడం లేద'ని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 18, 19, 20 తేదీల్లో నిర్వహించబోయే సాలూరు గ్రామదేవత శ్యామలాంబ పండుగ ఏర్పాట్లపై సోమవారం జేసీ శోభితతో కలసి స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జిల్లా స్థాయి అధికారులతో సమీక్షించారు. ముందుగా పోలీస్ కంట్రోల్ రూం, సీసీ కెమెరాలతో పర్యవేక్షణ, డ్రోన్, బారికేడ్లు, పార్కింగ్ స్థలాలు కేటాయింపు తదితర అంశాలపై చర్చించారు. పట్టణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉందని.. ఐదు డ్రోన్ కెమెరాలు.. 870 మంది పోలీసు సిబ్బంది అవసరం ఉందని డీఎస్పీ రాంబాబు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పండుగలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఆ శాఖకు సంబంధించి రూ.కోటి మంజూరు చేశామన్నారు.

రక్షిత పథకాలు ఏర్పాటు చేయండి

పట్టణంలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని ...మార్చి 17న మున్సిపాల్టీ ఖాతాలో ప్రభుత్వం నిధులు జమచేసినా అధికారులు పట్టించుకోకపోవడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 29 వార్డులో రక్షిత నీటి పథకాలను ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. ప్రతి వార్డులో రెండు రక్షిత నీటి పథకాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పండుగ సమయంలో రెండు పూటలా ప్రజలకు తాగునీరు అందించాలన్నారు. దేవదాయ శాఖ వద్ద ఎంత మొత్తం ఉందని ఆమె ప్రశ్నించారు. వారి వద్ద కేవలం రూ.95 వేలు మాత్రమే ఉన్నాయని చెప్పటంతో అసహనం వ్యక్తం చేశారు. సుమారు 15 ఏళ్లుగా అమ్మవారి ఆదాయం కేవలం రూ.95 వేలేనా అని ప్రశ్నించారు. వైద్య శిబిరాలు నిర్వహించాలని ప్రత్యేక అధికారి డాక్టర్ శివకుమార్‌ను ఆదేశించారు. బస్సుల సంఖ్యను పెంచాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. తొమ్మిదేళ్లకోసారి నిర్వహించుకునే పండుగ 15 ఏళ్ల తరువాత జరుపు కోవడం దారుణమన్నారు. ఇకపై తొమ్మిదేళ్లకే జరుపుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ డి.టి.వి.కృష్ణారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ అప్పలనాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



శిశిర రుతువులో ఆకులు రాల్చిన చెట్టు

నాడు రాల్చి.. నేడు చిగురించి..

సాలూరు రూరల్, మే5 (ఆంధ్రజ్యోతి): శిశిర రుతువులో ఆకులను రాల్చిన కాగు చెట్లు మళ్లీ చిగురిస్తున్నాయి. వసంత రుతువు వచ్చి నెల కావస్తుండడంతో సాలూరు మండలం కరకవలస సమీపంలో ఉన్న ఆ చెట్లు చిగురుటాకులతో స్థానికులు, ప్రయాణికులకు కనువిందు చేస్తున్నాయి. కొద్దిరోజుల కిందట శిశిర రుతువులో మోడువారిన అవే చెట్లు మళ్లీ పచ్చదనంతో కళకళలాడుతున్నాయి.



వసంత రుతువు కావడంతో చిగురుటాకులతో ఉన్న చెట్టు

సెక్షన్ ఆఫీసర్ సస్పెన్షన్

8 లో

- ఆదేశాలు జారీ చేసిన డీఎఫ్‌వో
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

పకడ్బందీగా ఇంటర్ సప్లిమెంటరీ

- 4,914 మంది విద్యార్థులు హాజరు
- 12 నుంచి 29 వరకు పరీక్షలు
- డీఆర్వో హేమలత

పార్వతీపురం, మే 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 12 నుంచి 20 వరకు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో కె.హేమలత ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..' ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఒకేషనల్, జనరల్ గ్రూప్‌ల నుంచి 4,914 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి ఇంటర్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండ్ ఇయర్ పరీక్షలు జరుగుతాయి. విద్యా ర్థులు నిర్ణీత సమయానికి ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలి. పూర్తి స్థాయిలో ఆర్టీసీ బస్సులు నడపాలి. నిరంతర విద్యుత్, తాగునీరు, మౌలిక వసతుల ఏర్పాట్లు చేయాలి. కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు తప్పనిసరి. ఓఆర్ఎస్, ప్రథమ చికిత్స సేవలు అందుబాటులో ఉండాలి. అధికారులు సెల్‌ఫోన్లు వాడరాదు. 144 సెక్షన్ అమలు చేయాలి.' అని తెలిపారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి డి.మంజులవీణ మాట్లాడుతూ.. ఇంటర్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు రాష్ట్రస్థాయిలోనే ప్రథమ స్థానంలో నిలిచారని వెల్లడించారు. సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో హేమలత పక్కన ఇంటర్ జిల్లా విద్యాశాఖాధికారి మంజుల వీణ

మినీ గురుకులాల్లో ప్రవేశాలకు

దరఖాస్తుల ఆహ్వానం

- వచ్చే నెల 3న లాటరీ
- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

8 లో

పెరిగిన

మాతృత్వ సెలవులు

- ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం
- రెగ్యులర్, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగినులకు వర్తింపు

127 కిలోల గంజాయి స్వాధీనం

- నిందితులు పరారీ
- కారును సీజ్ చేసిన పాచిపెంట పోలీసులు

7 లో

తోటపల్లికి తిరిగొచ్చాయ్..

- వీడని గజరాజుల బెడద

గరుగుబిల్లి, మే5(ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా సంతోషపురంలో హల్‌చల్ చేసిన ఏనుగులు సోమవారం తోటపల్లికి తిరిగొచ్చాయి. ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న అరటి తోటల్లో సంచరించడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మరోవైపు రబీ పంటలను ఏ నిమిషంలో ధ్వంసం చేస్తాయోనన్న భయాందోళన చెందుతున్నారు. తక్షణమే వాటిని తరలించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కాగా రహదారిపైకి ఏనుగులు రాకుండా అటవీ సిబ్బంది, ట్రాకర్లు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ప్రజలు ఎటువంటి కవ్వింపు చర్యలకు పాల్ప డరాదని సూచిస్తున్నారు.



ఉపాధి వేతనదారులకు ఊరట

● పెరిగిన రోజువారీ కూలి

గజపతినగరం, మేే5 (ఆంధ్రజ్యోతి): ఉపాధి వేతనదారులకు కేంద్ర ప్రభుత్వం స్వల్ప ఊరట నిచ్చింది. వీరికి వేసవిలో ప్రత్యేక భత్యం ఇవ్వనందున ఆ లోటును భర్తీ చేసేందుకు దినసరి వేతనం పెంచింది. ఇప్పటివరకు రూ.300 ఇస్తుండగా ఇకపై రూ.307 చేసింది. ఈ పెంపును గతనెల నుంచి అమల్లోకి వస్తుందని సంబంధిత అధికారులు తెలిపారు. గజపతినగరం మండలంలోని 30 పంచాయతీల్లో 13,220 మందికి జాబ్‌కార్డులు జారీ చేసినట్టు అధికారులు తెలిపారు. ఉపాధి పనులు చేసేవారు 10,400 మంది ఉన్నారు. అయితే వీరిలో సగం మంది దూరప్రాంతాల్లో పనులకు వెళుతున్నారు. అలాంటి వారంతా ఉపాధి వేతనం పెంపు వల్ల తిరిగి పనుల్లో చేరే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం రూ.247 నుంచి రూ.300 వరకు వేతనాలు చెల్లింపులు జరుగుతున్నాయి. మూడేళ్ల క్రితం ఫిబ్రవరి నుంచి జూన్ వరకు కూలీలకు 15 శాతం నుంచి 30 శాతం వరకు వేసవి భత్యం అదనంగా ఇచ్చేవారు. దీనికోసం పనుల కోసం తీసుకువెళ్లే పరికరాల కోసం, తాగునీరు, మజ్జిగకు సంబంధించి అదనపు భత్యం ఉండేది. ఇప్పుడు అలాంటి భత్యాలేవీ లేకుండా స్వల్పంగా వేతనం పెంచారు.

కొలతలు ప్రకారం పనులు

ఉపాధి పనులు గ్రామాల్లో ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇచ్చిన కొలతలు ప్రకారం వేతనం ఇవ్వడం జరుగుతుంది. వసతులు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. వేసవి దృష్ట్యా కూలీలు వడదెబ్బ కు గురవకుండా రెండు పూటలా పనులు కల్పిస్తున్నాం.

-కృష్ణవేణి, ఏపీవో, గజపతినగరం



మధుపాడలో పనులు చేపడుతున్న వేతనదారులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

విజయనగరం రింగురోడ్డు, మే 5 (ఆంధ్రజ్యోతి): ఉడా సబ్‌స్టేషన్ పరిధిలో బొగ్గుల దిబ్బ, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఫీడర్ల నిర్వహణ నిమిత్తం మంగళవారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉడా కాలనీ ఫేజ్-1, 2, ప్రభుత్వ సర్వజనాసు పత్రి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

●డెంకాడ: విద్యుత్ లైన్ల అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం మండలంలోని మోపాడ, జగన్నాథపురం, వల్లూరు, మోదవలస గ్రామాల్లో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఈఈ జి.సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమస్యల పరిష్కార వేదికకు రెండు వినతులు

విజయనగరం రింగురోడ్డు, మే 5 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రెండు వినతులు అందాయి. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య వినతులు స్వీకరించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ టి.రాయల్‌బాబు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, రమణమూర్తి, మేనేజరు ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

రాజాం ఐటీఐలో ఉచిత శిక్షణ

రాజాం, మే 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఏర్పాటు చేసిన నైపుణ్య కేంద్రంలో వెబ్ డెవలప్‌మెంట్ కంప్యూటర్ కోర్స్, సోలార్ పీవీ ఇన్‌స్టాలర్, ఎలక్ట్రికల్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రిన్సిపాల్ బండారు భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిగ్రీ చదివిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 10 లోగా రాజాంలోని ప్రభుత్వ ఐటీఐను సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7286042743, 8121450657లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

ఇనుప కంచె చోరీ

సంతకవిటి, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కరాపలికి చెందిన తూలుగు రమణమూర్తికి చెందిన ఇనుప కంచె ఆదివారం రాత్రి చోరీకి గురైంది. రమణమూర్తి తన ఖాళీ స్థలంలో గత నెల 23న ఇనుప కంచెను ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి కంచె చోరీకి విషయాన్ని సోమవారం గుర్తించిన ఆయన సంత కవిటి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఆర్. గోపాలరావు కేసు నమోదు చేశారు.

జూట్ మిల్లులో ఉత్పత్తి ప్రారంభం

కొత్తవలస, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మికాపల్లి పంచాయతీ సీతంపేటలో గల ధాన్య జూట్ మిల్లులో సోమవారం ఉత్పత్తి పూర్తిస్థాయిలో ప్రారంభమైంది. ఈ జూట్ మిల్లులో కార్మికులు, యాజమాన్యానికి మధ్య సమస్యలు పరిష్కారం కావడంతో యాజమాన్యం లాకౌట్ ఎత్తి వేసి, మిల్లులో ఉత్పత్తి ప్రారంభించింది. దీంతో మిల్లులో పనిచేస్తున్న 400 మంది కార్మికులకు రెండు షిఫ్టులలో యాజమాన్య పనులు కల్పిస్తోంది.

శ్మశానవాటిక ఎక్కడ?

జామి, మే 5 (ఆంధ్రజ్యోతి): మూడేళ్లుగా శ్మశానవాటిక లేకపోవడంతో జామి వాసులు అవస్థలకు గురవుతున్నారని మానవ హక్కుల జిల్లా ప్రతినిధి కొత్తలి గౌరినాయుడు అన్నారు. సోమవారం ఆయన జామిలో విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో శ్మశాన వాటిక స్థలాన్ని గ్రీన్‌ఫీల్డ్ హైవేకు అధికారులు అప్పగించి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. మండలకేంద్రంలో పదుల ఎకరాలు ప్రభుత్వ భూమి గత ప్రభుత్వంలో కొందరు ఆక్రమించుకుని అనుభవిస్తున్నారన్నారు. అయితే శ్మశానవాటికకు అధికారులు స్థలం సేకరించకపోవడం విడ్డూరమన్నారు. ఈ సమస్యను జాతీయ మానవ హక్కుల కమిషన్ దృష్టికి తీసుకెళ్తానని గౌరినాయుడు తెలిపారు.

అనాథ వృద్ధుల సేవకు ముందుకు రండి

కొత్తవలస, మే 5 (ఆంధ్రజ్యోతి): అనాథ వృద్ధులకు సేవ చేయడానికి ముందుకు రావాలని వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణంరాజు అన్నారు. సోమవారం మండలంలోని తుమ్మికాపల్లి గేట్ వద్ద ఫర్‌ది పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒంటరి అనాథ వృద్ధులకు బియ్యంతో పాటు నిత్యాసరాలను పంపిణీ చేశారు. చినరావుపల్లి సర్పంచ్ బూసాల దేముడు, బూసాల సన్యాశిరావు సహకారంతో నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు ఛైర్మన్ వి.హరికుమార్, రిటైర్డు రైల్వే ఉద్యోగి రమణ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్ మే 5 (ఆంధ్రజ్యోతి): అమరావతిలోని కార్యాలయంలో సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే అదితి గజపతిరాజు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సింహాచలంలోని వరహా నృసింహస్వామివారి చందనోత్సవ ప్రసాదం, చంద్రబాబు దంపతుల ఫొటోను సీఎంకు అందచేశారు.



సీఎంకు చిత్రపటాన్ని అందజేస్తున్న అదితి

పైడిమాంబ దేవర ఉత్సవానికి చాటింపు

విజయనగరం రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం సిరుల తల్లి పైడిమాంబ దేవర ఉత్సవానికి చాటింపు ప్రక్రియ సోమవారం మూడు లాంతర్లు వద్ద గల చదురుగుడిలో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ తలయారి రామవరపు చినపైడిరాజు ఆధ్వర్యంలో చాటింపు ప్రక్రియ జరిగింది. ఆలయ పూజారి బంటుపల్లి వెంకటరావు, ఆలయ అర్చకులు, సిబ్బంది, పైడితల్లమ్మ భక్తులు పాల్గొన్నారు. అనంతరం కోట వద్ద కూడా చాటింపు చేపట్టారు.



ఆలయం వద్ద చాటింపు ఘట్టం

వైసీపీ హయాంలోనే 'యాక్సిస్ ఎనర్జీ' ఒప్పందం

రాజాం, మే 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలోనే యాక్సిస్ ఎనర్జీ వెంచర్‌తో ఒప్పందాలు జరిగాయని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందంపై సొంత పత్రికలో అడ్డగోలు రాతలు అధినేత జగన్ రాయించారన్నారు. ఒప్పందం రద్దు చేసుకోవడానికి వీలులేకుండా ఆనాడే వైసీపీ ప్రభుత్వం మెలికలు పెట్టిన సంగతి దాచారన్నారు. యూనిట్ రూ.5.12 చొప్పున కొనడానికి వైసీపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటే, కూటమి ప్రభుత్వం దాన్ని రూ.4.60కి తగ్గించి కొంటున్న నిజం కూడా దాచిపెట్టారన్నారు. ఏపీఈఆర్‌సీ స్వతంత్ర ప్రతిపత్తిగల వ్యవస్థతో బలవంతంగా ఒప్పందం చేయించినట్టు అబద్ధాలు రాశారని కోండ్రు విమర్శించారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని ఎమ్మెల్యే కోరారు.



ఎమ్మెల్యే కోండ్రు

బొద్దాం-కొఠారిపురం రోడ్డుకు మోక్షం

● కోండ్రు చిత్రపటానికి పాలభిషేకం

రాజాం, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొద్దాం-కొఠారిపురం రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ చొరవతో రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈనేపథ్యంలో సోమవారం మాజీ సర్పంచ్ భూషణనా యుడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోండ్రు చిత్రపటానికి స్థానికులు పాలభిషేకం చేశారు. ఎమ్మెల్యే మురళీమోహన్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే పూర్తిస్థాయిలో రహదారి నిర్మాణం చేపట్టడంతో కొఠారిపురం, నందబలగ, లక్ష్మీపురం గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.



రోడ్డు పనులు జరుగుతున్న దృశ్యం

రోషిణికి అండగా ఉంటా

శృంగవరపుకోట రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షల్లో 588 మార్కులు సాధించిన మండలంలోని కొట్టాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని తెరపల్లి రోషిణి ఉన్నత చదువులకు అండగా ఉంటానని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ అన్నారు. టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన సదరు విద్యార్థినిని సోమవారం ఆయన సత్కరించారు. రూ. 5 వేలు నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఉన్నత చదువులకు అయ్యే ఖర్చులో తాను 50 శాతం భరిస్తామని హామీ ఇచ్చారు. వారి తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, జామి మండల పార్టీ అధ్యక్షుడు లగుడు రవికుమార్, ఎస్.కోట మండల పార్టీ కార్యదర్శి రామసత్యం, నాయకులు గుమ్మడి భారతి, ఇప్పాక వెంకటత్రివేణి తదితరులున్నారు.



రోషిణిని సత్కరిస్తున్న కృష్ణ

గిరిజనవర్సిటీ పనుల పరిశీలన

దత్తిరాజేరు/మెంటాడ, మే 5(ఆంధ్రజ్యోతి): దత్తిరాజేరు, మెంటాడ మండలాల పరిధిల్లో మర్రివలస, కుంతినవలసల్లో జరుగుతున్న గిరిజన వర్సిటీ పనులను ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు సోమవారం పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులతో మాట్లాడారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. మౌలిక సదుపాయాల పనులు ఎంతవరకు వచ్చిందీ అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బొబ్బిలి ఆర్డీవో రామ్మోహనరావు, దత్తిరాజేరు తహసీల్దార్ విజయభాస్కరరావు, మెంటాడ ఇన్‌చార్జి తహసీల్దార్ వెంకటరావు ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్

పీజీఆర్ఎస్‌లో 177 వినతులు

విజయనగరం కలెక్టరేట్, మే 5 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో వివిధ సమస్యలపై 177 వినతులు అందాయి. వినతులను ఇన్‌చార్జి కలెక్టర్ సేతు మాధవన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో కీర్తి, డిప్యూటీ కలెక్టర్లు మురళి, ప్రమీల స్వీకరించారు. వినతులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఇన్‌చార్జి కలెక్టర్ ఆదేశించారు.



వినతులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్

సమస్యలను పరిష్కరించండి: ఎస్పీ

విజయనగరం క్రైం, మే 5 (ఆంధ్రజ్యోతి): బాధితుల సమస్యలను చట్ట పరిధిలో తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 32 ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. అనంతరం సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వినతుల పూర్వపరాలను విచారణ చేపట్టి, చట్ట పరిధిలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారంలో జిల్లా పోలీసు కార్యాల యానికి నివేదించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, సీఐలు లీలారావు, ఆర్‌వీఆర్‌కె చౌదరి, సుధాకర్, ఎస్ఐ రాజేశ్ పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

ప్రాథమిక పాఠశాలలను కొనసాగించండి

విజయనగరం దాసన్న పేట, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 1 నుంచి 5 తరగతులను మోడల్ ప్రాథమిక పాఠశాల లేదా బేసిక్ ప్రాథమిక పాఠశాలగా కొనసాగించాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు సోమవారం మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక పాఠశాలలో రెండు ఎస్జీటీ పోస్టులు ఉండేలా చూడాలన్నారు. ప్రతి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం, పీడీ పోస్టులు మంజూరు చేయాలన్నారు. 45 మంది విద్యార్థులు దాటిన చోట రెండో సెక్షన్ ఇవ్వాలన్నారు. మాతృభాషా మాధ్యమాన్ని విద్యాహక్కు చట్టంలో పేర్కొన్న విధంగా కొనసాగించాలన్నారు. సీపీఎస్, జీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బంకురు జోగినాయుడు, రవి, రమేష్, గురుమూర్తి, పి.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

సంక్షేమ పథకాలపై అవగాహన


గజపతినగరం, మేే5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై భవన నిర్మాణ కార్మికులు అవగాహన పెంపొందించుకోవాలని న్యాయాధికారి ఎ.విజయ్‌రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎల్.రాంబాబు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. జిల్లా అసిస్టెంట్ లేబర్ అధికారి జి.ఎస్.ఎస్.కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు బతుకు తెరువు కోసం వివిధ గ్రామాల్లో పనులు చేపడుతుంటారన్నారు. అందుకు బీమాకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి

శేషగిరి రచనలు సమాజానికి అవసరం

విజయనగరం దాసన్నపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): దివంగత ఉపాధ్యాయుడు కోరెడ్ల శేషగిరి రచనలు సమాజానికి ఎంతో అవసరమని జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో శేషగిరి నాలుగో వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా శేషగిరి రాసిన వ్యాసాలు తరుగులేని కీర్తిసిరి పుస్తకంతో పాటు డీఎస్సీ పరీక్షల మెటీరియల్‌ను ఆయన శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేషగిరి మంచి నాయకుడని కొనియాడారు. ఆయన ఆలోచనలు, భావజాలం ముందుకు తీసుకువెళ్లాలని వారి అభిమానులను కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఎం.కృష్ణమూర్తి, యూటీఎఫ్ ప్రతినిధులు మోహనరావు, శ్రీనివాసరావు, ఈశ్వరరావు, రాజ్‌గోపాల్, కోరెడ్ల విజయగౌరి, శ్రీనివాసరావు, రాము, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని అవిష్కరిస్తున్న జడ్పీ చైర్మన్

పశువుల అక్రమ రవాణాపై నిఘా పెట్టండి: ఆర్డీవో

చీపురుపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): పశువుల అక్రమ రవాణాపై అధికారులు నిఘా పెట్టాలని చీపురుపల్లి ఆర్డీవో సత్యవాణి అన్నారు. సోమవారం తన కార్యాలయంలో జరిగిన డివిజన్ స్థాయి జంతు సంక్షేమ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. దేవాలయాలకు 300 మీటర్ల దూరంలో జంతు బలులు జరగకుండా చూడాలన్నారు. బలులను నిషేధిస్తూ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ గోసంరక్షణ సమాఖ్య రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆమె, డీఎస్పీ ఎస్.రాఘవులుతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ, పశు సంవర్ధక శాఖ డీడీ దామోదరరావు, చీపురుపల్లి ఏడీ డా.శారద, రాజాం మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు, చీపురుపల్లి సీఐ జి.శంకరరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.



వాల్ పోస్టరు విడుదల చేస్తున్న ఆర్డీవో, డీఎస్పీ

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

భోగాపురం, మేే5 (ఆంధ్రజ్యోతి): భోగాపురం సచివాలయం-2 సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం అదే గ్రామానికి చెందిన దుబ్బక సంతోష్ (37)ను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దాంతో అక్కడికక్కడే యువకుడు మృతి చెందారు. భోగాపురం పెద్ద వీధిలో నివాసం ఉంటున్న సంతోష్.. సచివాలయం-2 సమీపంలోని కల్లానికి నిత్యం వెళ్తుంటాడు. సోమవారం వేకువ జామున విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు వెళ్లే రహదారిలో నడుచుకుని వెళ్తుండగా అతడిని గుర్తుతెలియని వాహనం ఢీకొంది. స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. విగతజీవిగా పడి ఉన్న కుమారుడిని చూసి తల్లిదండ్రులు దుబ్బక ఈశ్వరమ్మ, అప్పన్న, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఈశ్వరమ్మ, అప్పన్నలకు ఇద్దరు కుమారులు ఉండగా, పెద్ద కుమారుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. చిన్న కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వారు కన్నీరుమున్నీరయ్యారు. ఘటనా స్థలాన్ని సీఐ కె.దుర్గాప్రసాద్, ఎస్ఐ సూర్యకుమారి పరిశీలించారు. మృతుడి తండ్రి అప్పన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు..

సీతానగరం, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భల్లకృష్ణరాయపురంలో సోమవారం ఉదయం బొత్స రమణమ్మ(75) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పార్వతీపురం రూరల్ సీఐ గోవిందరావు తెలిపిన వివరాల ప్రకారం.. రమణమ్మ తన కుమార్తె లక్ష్మితో కలిసి ఇంట్లో నివాసం ఉంటోంది. అయితే ఆదివారం లక్ష్మి వేరేవారి ఇంటికి నిద్రించడానికి వెళ్లింది. రమణమ్మ ఆ రోజు ఒంటరిగానే ఇంట్లో నిద్రించింది. సోమవారం ఉదయం లక్ష్మి తన ఇంటికి వచ్చి తల్లి రమణమ్మను నిద్రలేపగా.. ఆమె మృతిచెంది ఉంది. దీంతో లక్ష్మి బోరున ఏడ్చింది. బీరువాలో బంగారు ఆభరణాలు, డబ్బులు మాయమైనట్టు గుర్తించింది. దీంతో తన ఇంట్లో దుండగులు చొరబడి బంగారు ఆభరణాలు, డబ్బులు దొంగిలించి, తన తల్లిని హత్య చేసి ఉంటారని అనుమానంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో సీఐ గోవిందరావు ఆధ్వర్యంలో ఇన్‌చార్జి ఎస్ఐ నీలకంఠం, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించారు. రమణమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం కేంద్రా సుపత్రికి తరలించారు. సీతానగరం పోలీసులు కేసు నమోదు చేశారు.



రమణమ్మ (ఫైల్)

127 కిలోల గంజాయి స్వాధీనం

● నిందితులు పరారీ

పాచిపెంట, మే 5 (ఆంధ్రజ్యోతి): కారులో రవాణా చేస్తున్న 127 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని సాలూరు రూరల్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు పాచిపెంట మండలంలోని పద్మాపురం జంక్షన్ వద్ద ఎస్ఐ కె.వెంకటసురేష్ తన సిబ్బందితో సోమవారం దాడి చేసి కారును పట్టుకున్నారని తెలిపారు. కారులో ఉన్న 127 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, సీజ్ చేశారని చెప్పారు. అయితే నిందితులు పరారయ్యారని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామన్నారు.



స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

మెంటాడలో 30 మద్యం సీసాలు..

●మెంటాడ, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని లోతుగెడ్డ గ్రామానికి చెందిన వ్యక్తి నుంచి సోమవారం 30 మద్యం సీసాలను ఆండ్ర పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సదరు వ్యక్తి మెంటాడ నుంచి బస్సులో మద్యం సీసాలు తరలిస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు దాడి చేశారు. మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని అతడిపై ఆండ్ర ఎస్ఐ సీతారాం కేసు నమోదు చేశారు.

చీటింగ్ కేసులో వ్యక్తి అరెస్టు

విజయనగరం క్రైం, మే 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ ప్రైవేట్ బ్యాంకును మోసగించి రుణం తీసుకున్న కేసులో గుర్ల మండలం గిరడ గ్రామానికి చెందిన బాలచంద్రరావును సోమవారం అరెస్టు చేసినట్టు వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. ఇందుకు సంబంధించిన సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాలచంద్రరావు భూమి విలువ ఎక్కువ చూపించి, బ్యాంకులో రూ.34 లక్షల రుణం తీసుకుని మోసగించారన్నారు. అలాగే తక్కువ విలువ కలిగిన భూమిని ఎక్కువగా చూపించి మరో రూ.14 లక్షలు తీసుకుని మోసానికి పాల్పడినట్టు బ్యాంకు ప్రతినిధులు ఫిర్యాదు చేశారన్నారు. దాంతో బాలచంద్రరావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని వన్‌టౌన్ సీఐ తెలిపారు.

మినుములు కొనుగోలు చేయండి

● కలెక్టరేట్ ఎదుట రైతుల నిరసన


విజయనగరం కలెక్టరేట్, మే 5 (ఆంధ్రజ్యోతి): పంటను కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆందోళన బాటపట్టారు. మండుటెండలో కలెక్టరేట్ గేటు ఎదుట బైఠాయించారు. జిల్లాలో పెసలు, మినుములు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేదని మండిపడ్డారు. సోమవారం కలెక్టరేట్ వద్ద మినుల బస్తాలతో రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ మార్చి 18న గంట్యాడలోని రైతు సేవ కేంద్రంలో, జామి మండలంలో విసినిగిరిలో మినులు, పెసలు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అయితే ఇప్పటి వరకూ ఒక్క గింజా కొనుగోలు చేయలేదన్నారు. కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసిన సమయంలో బస్తా రూ.7400 ఉండగా ఇప్పుడు రూ.5400కు పడిపోయిందన్నారు. దీంతో రైతులు వద్ద మినుములు నిల్వ ఉన్నాయన్నారు. మినుములు కొనుగోలుకు జిల్లా అధికారులు హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాంతో వ్యవసాయ శాఖ జేడీ వి.టి.రామారావు, మార్క్‌ఫెడ్ డీఎం వెంకటేశ్వరరావు రైతులతో మాట్లాడారు. మంగళవారం నుంచి మినుములు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు రాంబాబు, ఆదినారాయణ ఉన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

అనుమతులు లేని నిర్మాణాల కూల్చివేత

విజయనగరం రింగురోడ్డు, మే 5 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేని నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య స్పష్టం చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం ఎన్‌సీఎస్ రోడ్డులోని నిర్మాణాన్ని ప్రణాళిక సిబ్బంది తొలగించారు. గతంలో నిబంధనలకు విరుద్ధంగా దుకాణ సముదాయాన్ని నిర్మించడంపై అందిన ఫిర్యాదు నేపథ్యంలో నగరపాలక సంస్థ ప్రణాళిక విభాగం అధికారులు నిర్మాణాలు తొలగింపునకు నోటీసులు జారీ చేశారు. అయితే నిర్మాణదారులు కోర్టును ఆశ్రయించారు. తుదకు హైకోర్టు నుంచి వచ్చిన ఆదేశాల మేరకు కమిషనర్ నల్లనయ్య స్పందించి తక్షణమే సదరు కట్టడాన్ని తొలగించాలని ఆదేశించారు. దాంతో దుకాణ సముదాయాన్ని సిబ్బంది కూల్చివేశారు.



అక్రమ కట్టడాన్ని కూల్చివేస్తున్న సిబ్బంది

జంఝావతి తేలేనా?

(5వ పేజీ తరువాయి)

సమావేశం నిర్వహించారు. ముంపు ప్రాంతం, బ్యాక్ వాటర్ ఏరియా కలిపి 1175.10 ఎకరాలుగా గుర్తించారు. ఇందులో 848.76 ఎకరాలు ప్రభుత్వ భూమిగా, మిగిలిన 323.34 ఎకరాలు ప్రైవేటు భూమిగా నిర్ధారించారు.

● ఇదే సమావేశం తర్వాత గ్రామసభలు నిర్వహించారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఫైనలైజ్ చేశారు. ఆ జాబితాను ఏపీ ప్రభుత్వానికి పంపించారు. ఆ మొత్తం డిపాజిట్ చేస్తే అప్పుడు ప్రాజెక్టు పూర్తి నిర్మాణానికి క్లియరెన్స్ ఇస్తామని ఒడిశా చెప్పింది.

● ఈలోగా 2005-06లో జంఝావతి స్పిల్‌వే వద్ద ఏపీ ప్రభుత్వం రబ్బరు డ్యాంను నిర్మించింది. 24,640 ఎకరాలకు తాత్కాలికంగా నీరందించేందుకు చర్యలు తీసుకుంది.

● 2007, సెప్టెంబరు 18న ఒడిశా రాష్ట్రం కొరాపుట్ జిల్లా కలెక్టర్ ద్వారా ఒడిశా ప్రభుత్వం ప్రతిపాదనలన్నీ తిరస్కరించింది. ఇక కొరాపుట్ రీజియన్‌లో గిరిజనుల సోషియో ఎకనామిక్ సర్వే పేరుతో గ్రామసభలు నిలిపివేయాలని ఆదేశించింది.

● ప్రాజెక్టు పూర్తికి సహకరించాలని 2008, ఆగస్టు 1న ఏపీ ప్రభుత్వం ఒడిశాకు లేఖ రాసినా స్పందన లేకపోయింది.

● 2009 ఆగస్టు 12న కేంద్ర జల వనరులశాఖ, అటవీ పర్యావరణ శాఖకు ఇదే విషయంపై ఏపీ ప్రభుత్వం లేఖ రాసింది.

● 2021, నవంబరు 9న ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్, ఒడిశా సీఎం నవీన్‌పట్నాయక్ చర్చించారు. అయినా ఫలితం లేకపోయింది.

ప్రభుత్వానికి నివేదించాం

జంఝావతి ప్రాజెక్టు సమస్యపై గత నెల 22న విజయనగరం వచ్చిన నీటి పారుదలశాఖ మంత్రి రామానాయుడుకు నివేదిక అందించాం. ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి కూడా తెలియజేశాం. సమస్య పరిష్కారమవుతుందని ఆశిస్తున్నాం.

- బి.సంతోష్‌కుమార్, డీఈ, జంఝావతి ప్రాజెక్టు

అసెంబ్లీలోనే ప్రస్తావించా

జంఝావతి ప్రాజెక్టు సమస్యను అసెంబ్లీలోనే ప్రస్తావించా. కచ్చితంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతో ఒడిశాతో ఉన్న వివాదం పరిష్కారమవుతుంది.

- తోయక జగదీశ్వరి, ప్రభుత్వ విప్, కురుపాం

అధైర్య పడొద్దు

● గిరిజనులకు అండగా ఉంటాం: మంత్రి సంధ్యారాణి



మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

సాలూరు, మే 5(ఆంధ్రజ్యోతి): అధైర్యపడొద్దు గిరిజనులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి హామీ ఇచ్చారు. సోమవారం ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ సభ్యులు మంత్రిని సాలూరులోని తన నివాసంలో కలిశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల కోసం ప్రత్యేక డీఎస్సీని ప్రకటించాలని కోరారు. మంత్రి మాట్లాడుతూ జీవో నెంబర్3కి సమాన ప్రయోజనాలున్న వేరొక జీవోను తీసుకువస్తామని తెలిపారు. మెగా డీఎస్సీ 2025లో గిరిజనులకు కేటాయించిన ఉపాధ్యాయ పోస్టులను గిరిజనులతోనే భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్‌లో మౌలిక సదుపాయాలు కల్పించండి

బెలగాం, మే 5 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని వీరఘట్టం మండలం విక్రపురం గ్రామస్థులు కోరారు. ఈ మేరకు మాజీ సర్పంచ్ ఎం.వెంకటరమణ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం జేసీ శోభితకు వినతిపత్రం అందజేశారు.

పాత మేట్లనే కొనసాగించాలి



ఎంపీడీవోకు సమస్యను వివరిస్తున్న వేతనదారులు

మక్కువ, మే 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పాత మేట్లనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఎ.వెంకంపేట గ్రామానికి చెందిన వేతనదారులు సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడించారు. వేతనదారుల తీర్మానం లేకుండా కొత్తవారికి ఎలా అవకాశం ఇస్తారంటూ ఏపీవో ఎస్.ఈశ్వరమ్మను నిలదీశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వేతనదారులను సముదాయించారు. అనంతరం కార్యాలయానికి చేరుకున్న ఎంపీడీవో డీడీ స్వరూపారాణికి మేట్లు, వేతనదారులు సమస్యను వివరించారు. వేతనదారుల తీర్మానం మేరకు న్యాయం జరిగేలే చూస్తామని ఆమె హామీఇచ్చారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

పాలకొండ, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి యాజమాన్యం చొరవ చూపాలని ఎన్ఎంయూ డిపో కార్యదర్శి వావిలపల్లి రాజేష్ కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఆర్టీసీ అధికారికి వినతిపత్రాన్ని అందించారు. ఇప్పటికే ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు తెలియజేశామని చెప్పారు. గత కొంతకాలం నుంచి డిపోలో సర్వీస్ తక్కువ పేరిట తొలగించిన బస్సులను తిరిగి ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో వై.నీలయ్య, ఎంఆర్ మూర్తి, ఎంవీ నాయుడు, డీఆర్ రావు, జీఎస్ నారాయణ, బీవీ రమణ పాల్గొన్నారు.

మినీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట రూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలోని సీతంపేట, కారిగూడ మినీ గురుకుల పాఠశాలల్లో 2, 5, 6, 7వ తరగతిలో ప్రవేశాలకు గిరిజన బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీతంపేట మినీ గురుకులం పాఠశాలలోని సీట్లు సీతంపేట మండలం, కారిగూడ మినీ గురుకుల పాఠశాలలోని సీట్లు కొత్తూరు మండలం వారికి కేటాయించామని చెప్పారు. మిగిలిన సీట్లను ఇతర మండలాల్లోని గిరిజన విద్యార్థులకు కేటాయిస్తామ ని పేర్కొన్నారు. ఈ పాఠశాలలో ప్రవేశాలకు ఈనెల 26వ తేదీలోగా దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. సీట్ల భర్తీకి వచ్చే నెల 3వ తేదీన ఏపీఆర్ బాలుర గురుకుల పాఠశాలలో లాటరీ నిర్వహిస్తామన్నారు.

జిల్లా కేంద్రంలో వినతుల స్వీకరణ

ఒడిశా

రాయగడ, మే 5(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ సమావేశ హాలులో జిల్లా యంత్రాంగం సోమవారం వినతుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించింది. కలెక్టర్ పారుల్ పట్వారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 29 మంది అర్జిదారులు తమ సమస్యలను విన్నవించారు. కలెక్టర్ వెంటనే నలుగురు సమస్యలను పరిష్కరించారు. వారితో పాటు ఇద్దరికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి, ఒకరికి రెడ్‌క్రాస్ నిధి నుంచి ఆర్థిక సహాయం అందజేశారు. అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి

● పీజీఆర్ఎస్ కార్యాక్రమాలకు వెల్లువెత్తిన వినతులు



పార్వతీపురం: వినతులు స్వీకరిస్తున్న డీఆర్వో హేమలత



బెలగాం: వినతులు పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి



సీతంపేట రూరల్: అర్జీదారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలని ఉన్నతాధికారులు సూచించారు. జిల్లాలో కలెక్టర్, ఎస్పీ, ఐటీడీఏ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వారు పాల్గొని, వినతులు స్వీకరించారు.

కలెక్టర్ పీజీఆర్ఎస్‌కు 98..

పార్వతీపురం, మే 5 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత అన్నారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్య క్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్ డా.పి.ధర్మాచంద్రారెడ్డితో కలిసి ఆమె 98 మంది అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. గొట్టమంగళాపురం, సంకిలి బ్రిడ్జి దగ్గరలో ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని మజ్జి పారినాయుడు వినతిపత్రం ఇచ్చారు. పార్వతీపురం పట్టణంలోని 14వ వార్డులో బైపాస్ కాలనీ వీధిలో మురుగు నీటి కాలువ సమస్యపై ఈ కాలనీవాసులు వినతిపత్రం అందించారు. ఇలా అనేక సమస్యలపై వినతిపత్రాలు అందాయి. వెలుగు, ఐసీడీఎస్ పీడీలు వై.సత్యంనాయుడు, డా.టి.కనకదుర్గ, వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి డా.టి.జగన్మోహన్‌రావు, జిల్లా బీసీ సంక్షేమాధికారి ఇ.అప్పన్న, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 14..

బెలగాం, మే 5 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుల పరిష్కారమే ధ్యేయమని ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 14 ఫిర్యాదులు అందినట్టు ఆయన తెలిపారు. వినతిపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, బాధితులకు తగిన న్యాయం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. డీసీఆర్‌బీ ఎస్ఐ ఫక్రుద్దీన్, జగదీష్‌నాయుడు పాల్గొన్నారు.

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 26..

సీతంపేట రూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ పీజీఆర్ఎస్‌కు గిరిజనుల నుంచి 26 వినతులు వచ్చాయి. తాగునీటి సౌకర్యం కల్పించాలని మేడవొబ్బంది, కొండాడ గ్రామ స్థులు కోరారు. దబర గ్రామంలో అంతర్గత సీసీ రహదారి, రక్షణగోడ నిర్మించాలని ఒకరు వినతిపత్రం ఇచ్చారు. ఇలా అనేక వినతులు వచ్చాయి. పీజీఆర్ఎస్‌లో ఇన్‌చార్జి పీవోతో పాటు ఏపీవో జి.చిన్నబాబు, పీహెచ్‌వో వెంకట గణేష్, ఐకేపీ ఏపీడీ సన్యాసిరావు పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తా..

● ఎమ్మెల్యే విజయచంద్ర



సమస్యలపై వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే బోనెల విజయచం ద్ర అన్నారు. నర్సిపురం పంచాయతీ పరిధిలోని తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆయన వినతులు స్వీకరించారు. సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భామిని మండల అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే జయకృష్ణ



భామిని: కేజీబీవీ అదనపు భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

భామిని, మే 5 (ఆంధ్రజ్యోతి): భామిని మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. సోమవారం భామిని వచ్చిన ఆయన రూ.2.55 కోట్ల సర్వశిక్ష నిధులతో మంజూరైన కేజీబీవీ అదనపు భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాబార్డు నిధులతో ఘనసర నుంచి కీసర, కోసలి బీటీ రహదారికి రూ.1.7 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు భామిని సమీపంలో కొండలోవ గెడ్డ రిజర్వాయర్, ఆర్టీసీ కాంప్లెక్స్‌కు సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యేని కోరారు. ప్రాధాన్యతను గుర్తించి అన్ని సౌకర్యాలు చేపడతామని ఆయన హామీఇచ్చారు. ఆయనతో పాటు ఏఎంసీ చైర్మన్ బిడ్డిక సంధ్యారాణి, మండల నాయకులు ఎం.జగదీశ్వరరావు, బి.ఆనందరావు, జనసేన నాయకుడు కిరణ్‌కుమార్, గోవిందరావు, రామారావు, బి.ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులపై ఆగ్రహం

అనంతగిరి సమీపంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ లైన్‌కు బీటీ రోడ్డుపైన విద్యుత్ సిమెంట్ స్తంభాలు ఈడ్చుకుని వెళ్లడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో కష్టపడి కొత్తూరు-బత్తిలి బీటీ రోడ్డును బాగు చేస్తే సిమెంట్ స్తంభాలు ఈడ్చుకుని వెళ్లి రోడ్డును పాడుచేస్తున్నారని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస రావుపై ఎమ్మెల్యే మండిపడ్డారు. బత్తిలి ఎస్ఐకి సమాచా రం అందించారు. కాంట్రాక్టర్ వినియోగిస్తున్న యంత్రా లను సీజ్ చేయాలని, కేసు నమోదు చేయాలని ఆదేశించారు.

కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన

సీతంపేట రూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): సీతంపేట గ్రామంలోని కేజీబీవీలో రూ.2.12 కోట్లతో నిర్మించనున్న జూనియర్ కళాశాల భవనానికి ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సోమవారం శంకుస్థాపన చేశారు. ఏఎంసీ చైర్మన్ బి.సంధ్యారాణి, సర్పంచ్ ఆరిక కళావతి, కూటమి నాయకులు సవరతోట మొఖలింగం, మండంగి విశ్వనాథం, పవన్, హెచ్.ప్రసాద్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పెరిగిన మాతృత్వ సెలవులు

పార్వతీపురం, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగినులకు మాతృత్వ సెలవులను 120 నుంచి 180 రోజులకు ప్రభుత్వం పెంచింది. అదేవిధంగా ఇకపై మూడో కాన్పుకు ప్రసూతి సెలవులు మంజూరు చేస్తూ సోమవారం ఆదేశాలు జారీ చేసింది. గతంలో ఇద్దరు బిడ్డలకు మాత్రమే ప్రసూతి సెలవులను మంజూరు చేసేవారు. కానీ తాజాగా మూడో బిడ్డకు కూడా ప్రసూతి సెలవులను మహిళా ఉద్యోగినులకు మంజూరు చేయనున్నట్టు ప్రభుత్వ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న రెగ్యులర్, కాం ట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగినులకు ఈ జీవో వర్తి స్తుంది. ఈ జీవో ప్రకరం ఆరు నెలల పాటు జీతంతో పాటు వేతనాన్ని ప్రభుత్వం ఉద్యోగినులకు ప్రతి నెలా చెల్లించనుంది.

ఎమ్మెల్యే విజయచంద్రకు సన్మానం

పార్వతీపురం, మే 5 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు విశాఖపట్నం ఆంధ్రా యూనిర్శిటీలో ఎస్‌వీకేఎస్ ఆర్గనైజేషన్ ఘనంగా సన్మానించింది. ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసి పదేళ్లు అయిన సందర్భంగా సోమవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను ఆహ్వానించి సన్మానించారు.

దిగువ ద్వారబంధంలో స్ప్రేయింగ్

సీతంపేట రూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువ ద్వారబంధం గ్రామంలో మలేరియా జ్వరాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వైద్య, మలేరియా సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం ఏసీఎం మందును స్ప్రేయింగ్ చేశారు. అలాగే దోనుబాయి పీహెచ్‌సీ పరిధిలోని మలేరియా హైరిస్క్ గ్రామాలైన తాడిపాయి, కె.బొంబడుగూడ, సంకిలిగూడ, లక్కాయిగూడ, వి బుడ్డడుగూడ గ్రామాల్లో ఏసీఎం మందు స్ప్రేయింగ్ చేశారు. గ్రామాల్లో చేపడుతున్న స్ప్రేయింగ్‌ను జిల్లా మలేరియా అధికారి పీవీ సత్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి జె.మోహనరావు పరిశీలించారు.

శిక్షణ తరగతుల పరిశీలన

సీతంపేట రూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులు కాని విద్యార్థుల కోసం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికలు, బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులను ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు సోమవారం పరిశీలించారు. ఈనెల 19వ తేదీ నుంచి జరగబోయే పరీక్షల్లో చక్కగా రాసి, మెరుగైన మార్కులతో ఉత్తీర్ణులు అవ్వాలని సూచించారు. హెచ్ఎంలు వసంత లక్ష్మి, చంద్రరావు ఉపాధ్యాయులు సూరిబాబు, రవి తదితరులు ఉన్నారు.

నగర పంచాయతీ చైర్‌పర్సన్ బాధ్యతల స్వీకరణ

పాలకొండ, మే 5 (ఆంధ్రజ్యోతి): పాలకొండ నగర పంచాయతీ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన ఆకుల మల్లీశ్వరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, టీడీపీ నాయకుడు పల్లా కొండలరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, కూటమి నాయకుల సమక్షంలో కోటదుర్గమ్మ ఆలయం నుంచి నగర పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం నగర పంచాయతీ కమిషనర్ రత్నంరాజు మల్లీశ్వరితో ప్రమాణం చేయించారు. కూటమి నాయకులు ఊణ్ణ పెదబాబు, టంకాల దుర్గారావు, కొరికాన గంగునాయుడు, అడపా బాబ్జీ, కె.కుమార్‌రాజా పాల్గొన్నారు.

దళిత నాయకుల అభినందన

పాలకొండ, మే 5 (ఆంధ్రజ్యోతి): పాలకొండ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికై సోమవారం బాధ్యతలు స్వీకరించిన ఆకుల మల్లీశ్వరిని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో దళిత సంఘ నాయకులు సత్కరించి, అభినందించారు. ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీ హాళ్లకు స్థలాన్ని కేటాయించాలని కోరారు. అలాగే నూతన కమిషనర్‌గా వచ్చిన రత్నంరాజును కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు బత్తిన మోహన్, గురుబిల్లి రవికుమార్, పొట్నూరు రమేష్, అంపిలి శంకర్, బబ్బురు గణేష్, రావాడ రవి పాల్గొన్నారు.

ఉల్లిభద్రలో పూరిళ్లు దగ్ధం

గరుగుబిల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): ఉల్లిభద్రలో సోమవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన జి.కంచెమ్మ, ఎం.నాగభూషణరావుకు చెందిన పూరిళ్లు ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతయ్యాయి. వీఆర్వో శ్రీనివాసరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సుమారు రూ.2లక్షలు ఆస్తి నష్టం సంభవించిందని అంచనా వేశారు.

ధర్నాను విజయవంతం చేయండి

పాలకొండ, మే 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ఈనెల 6న నిర్వహించనున్న ధర్నాను తోటపల్లి ఆయకట్టు రైతులు విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బంటు దాసు, అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు, రైతు ప్రతినిధి నరసింగపాణిగ్రాహీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం పాలకొండలో కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 8,500 ఎకరాలకు తోటపల్లి ఆయకట్టు భూములకు అనేక ఏళ్లగా సాగునీరు అందడం లేదన్నారు. ఆయకట్టు రైతులందరూ ఉదయం 10.30 గంటలకు పాలకొండలోని కోటదుర్గమ్మ ఆలయానికి చేరుకొని ధర్నాకు విజయవంతం చేయాలని వారు కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించండి



కురుపాం: తహసీల్దార్ రమణమ్మకు వినతిపత్రం అందస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

పాలకొండ, మే 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ ఆర్.మురళీకృష్ణకు వినతిపత్రం అందించారు. ఏపీటీఎఫ్ నాయకులు శాసపు వాసుదేవరావు, గోగుల సూర్యనారాయణ, ఆర్.ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు. ● కురుపాం: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కారించాలని కోరుతూ ఏపీటీఎఫ్ నాయకులు సోమవారం స్థానిక తహసీల్దార్ రమణమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మర్రాపు మహేష్ మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలలకు పూర్వ ప్రాథమిక విద్యను అనుసంధానించాలని కోరారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6, 7 తరగతులు ఉన్నచోట నాలుగు ఎస్ఏ పోస్టులు, 6, 7, 8 తరగతులు ఉన్నచోట ఆరు పోస్టులు కొనసాగించాలని కోరారు. ఏపీటీఎఫ్ నాయకులు వేణు గోపాల్, శంకరరావు, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు. ● బొబ్బిలి రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఏపీటీఎఫ్ నాయకులు నిరసన చేపట్టారు. దశాబ్దాలుగా అమలవుతున్న ప్రాథమిక పాఠశాల వ్యవస్థకు కేవలం 1, 2 తరగతులతో వేల సంఖ్యలో ఫౌండేషన్ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నారని.. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులపై ఒత్తిడి పెరుగు తుందన్నారు. అనంతరం స్థానిక తహసీల్దార్ ఎం.శ్రీనుకు వినతిపత్రం అందజేశారు.

సెక్షన్ ఆఫీసర్ సస్పెన్షన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పార్వతీపురం, మే 5 (ఆంధ్రజ్యోతి): మక్కువ మండల అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ నారాయణ రావును సస్పెండ్ చేస్తూ డీఎఫ్‌వో ప్రసూన ఆదేశాలు జారీ చేశారని సాలూరు రేంజర్ తవిటినాయుడు సోమవారం స్థానిక విలేకర్లకు తెలిపారు. జంతికొండ ప్రాంతంలో అటవీశాఖ పరిధిలోని ఉన్న టేకు చెట్లను తాళ్లబురిడి గ్రామానికి చెందిన ఒక కలప వ్యాపారి అక్రమంగా తరలించేందుకు అటవీశాఖలోని బేస్ క్యాంప్ సిబ్బంది సహకరించారు. విషయం తెలుసుకున్న అటవీ శాఖాధికారులు అక్రమంగా తరలించిన కలపను స్వాధీనం చేసుకుని, సాలూరు అటవీశాఖ పరిధిలో ఉన్న డిపోకు తరలించారు. ఈ ఘటనపై ఆంధ్రజ్యోతి ఈనెల 3న 'ఇంటిదొంగల పనేనా' అనే శీర్షికతో కథనం ప్రచురించింది. దీనిపై డీఎఫ్‌వో ప్రసూన స్పందించి సెక్షన్ ఆఫీసర్ నారాయణరావును సస్పెండ్ చేశారు.

చేతుల శుభ్రతతో రోగాలు దూరం

● ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు



చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గరుగుబిల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): చేతుల పరిశుభ్రతతోనే రోగాలకు దూరంగా ఉండే అవకాశం ఉందని ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి తెర్లి జగన్మోహనరావు అన్నారు. చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఉల్లిభద్ర గ్రామంలో ఆయన అవగాహన కల్పించారు. ప్రస్తుత జీవన విధానంలో ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. వైద్యుడు ఎస్.సంతోష్‌కుమార్, ఎపిడిమిక్ ఈవో సత్తిబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్యదర్శులపై చిన్నచూపు తగదు

● జేసీ వ్యాఖ్యలపై ఆందోళన

● విధులపై స్పష్టత ఇవ్వాలని వినతి



సాలూరు రూరల్: ఎంపీడీవో పార్వతికి వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

గరుగుబిల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పంచాయతీల కార్యదర్శులపై జేసీ చేసిన వ్యాఖ్యలపై వారు ఖండించారు. ఈమేరకు సోమవారం స్థానిక ఎంపీడీవో జి.పైడితల్లికి వినతిపత్రం అందించారు. ఇటీవల జేసీ ఓ సమావేశంలో మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు సచివాలయాల సిబ్బందితో సమానమేనని వ్యాఖ్యానించడం సరికాదన్నారు. సిబ్బందికి జీతాలు చెల్లించేంతవరకే కార్యదర్శుల బాధ్యత అని వ్యాఖ్యానించడం విచారకరమన్నారు.

● సాలూరు రూరల్: గ్రామ సచివాలయాల్లో తమ విధులపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయకుంటే క్లస్టర్ విధులకే పరిమితమవుతామని సాలూరు మండల కార్యదర్శులు స్పష్టం చేశారు. జేసీ ఈనెల 2న సమావేశంలో పంచాయతీ కార్యదర్శులపై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో వారి సంఘం అధ్యక్షుడు ఆధ్వర్యంలో సోమవారం సాలూరు ఎంపీడీవో గొల్లపల్లి పార్వతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో తాము డీడీవోలుగా ఉన్నామని తెలిపారు. సచివాలయాల్లో తాము ఏమేమి చేయాలో స్పష్టమైన మార్గదర్శకాలిస్తే ఆయా పనులు చేయడానికి సిద్ధమన్నారు. మార్గదర్శకాలు వచ్చే వరకు తమ క్లస్టర్ పనులు చేసుకుంటామని స్పష్టం చేశారు. ● భామిని: తమ విధులు, కార్య ప్రణాళికలు రాత పూర్వకంగా తెలియజేయాలని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది కోరారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీవో కె.సత్యంకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ● కురుపాం: జేసీ వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని కోరుతూ మండలంలోని పంచాయతీ కార్యదర్శులు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వద్ద ఎంపీడీవో జె.ఉమామహేశ్వరికి వినతిపత్రం అందజేశారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.